క్లుప్తంగా

చంద్రంపాలెంలో వైద్య శిబిరం



శిబిరంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

సామర్లకోట: మండల పరిధిలో చంద్రపాలెం గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. వైఎస్సార్ సీపీ నాయకుడు సన్నిబోయిన నూకరాజు మనవడు నిహన్ పుట్టిన రోజును పురస్కరించుకొని గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ మేరకు డాక్టర్లు అల్లి విజయలక్ష్మీ, డాక్టరు మాధవరెడ్డిలు పీబీ, సుగర్‌లతో పాటు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి పలువురు రోగులకు అవసరమైన ఉచిత మందులు అందజేశారు. ఈ శిబిరంలో సుమారు 150 మంది పరిసర ప్రాంతాల ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నట్లు నూకరాజు తెలిపారు.

విద్యార్థికి అండగా పోలీసులు



విద్యార్థికి ఆర్థిక సాయం అందిస్తున్న ఎస్సై మౌనిక

పెద్దాపురం: తల్లిదండ్రులను కోల్పోయిన పేద విద్యార్థికి పెద్దాపురం పోలీసులు అండగా నిలిచారు. స్థానిక సత్తిరెడ్డిపేటకు చెందిన కర్రి యశ్వంత్ అనే బాలుడి స్థానిక ట్రినిటీ హైస్కూల్‌ల్లో 8వ తరగతి చదువుతున్నాడు. అయితే నానమ్మ అప్పలనర్సమ్మ దగ్గర ఉంటున్న తనకు 9వ తరగతిలో చదివించే స్తోమత లేదు. దీంతో పట్టణ యువత వంగలపూడి సతీష్ గతంలో అప్పటి పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి వద్దకు తీసుకువెళ్లి బాలుడి పరిస్థితి చెప్పడంతో ఆమె 8వ తరగతి అవసరమైన ఫీజును చెల్లించి బాలుడిని చదివించారు. ఆమె బదిలీ అనంతరం మళ్లీ ఆ కుటుంబం సతీష్‌ను ఆశ్రయించగా పెద్దాపురం ఎస్సై మౌనిక వద్దకు తీసుకువెళ్లి పరిస్థితిని వివరించారు. దీంతో ఆమె స్పందించి విద్యార్థి చదువకు అవసరమైన ఫీజు చెల్లించేందుకు హామీ ఇచ్చారు. ఇటువంటి సేవా కార్యక్రమానికి ముందుకొచ్చిన ఎస్సై మౌనికను పలువురు అభినందిస్తున్నారు.

ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి



కొత్తపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కొత్తపల్లి: ఎస్జీటీ ఉపాధ్యాయులకు మాన్యువల్ కౌన్సెలింగ్ అని చెప్పి ఇపుడు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ప్రభుత్వం, అధికారులు తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలని మండల ఉపాధ్యాయ సంఘాలు సభ్యులు డిమాండు చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం ఆందోళన నిర్వహించారు. అనంతరం విద్యాశాఖ సిబ్బందికి వినతిపత్రాన్ని అందించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన మొండి వైఖరిని విరమించుకోవాలని లేకపోతే జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ద్వారా నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

మాన్యువల్ కౌన్సెలింగ్‌పై యూటీఎఫ్ నిరసన



గొల్లప్రోలులో ఎంఈఓకు వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ ఉపాధ్యాయులు

పిఠాపురం: ఎస్‌జీటీ బదిలీలకు వెబ్ కౌన్సెలింగ్ విధానాన్ని రద్దు చేసి మాన్యువల్‌గా నిర్వహించాలని యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు గొల్లప్రోలు ఎమ్మార్సీ వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు గొల్లప్రోలు మండల శాఖ ఆధ్వర్యంలో నిరసన అనంతరం ఎంఈఓ-1 నాయుడు వెంకటేశ్వరరావు, ఎంఈఓ-2 బొడ్డేటి శివ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎ.సీతారామరాజు, మండల శాఖ అధ్యక్షుడు గెడ్డమూరి ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మేడసాని సత్యనారాయణ, దాడి పద్మనాభం, వానపల్లి విజయ శంకర్, అల్లి వీరబాబు, గొల్లపల్లి సూర్యనారాయణమూర్తి, ఈపు గోవిందరాజులు, వానపల్లి సూర్యం, బొండాడ నాగబాబు, సురేష్ కుమార్, నేమాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కూటమిలో మట్టి కుంపటి

- ఆర్‌బీపట్నం రాఘవమ్మ చెరువులో అక్రమ తవ్వకాలు
- గతంలో రామేశంమెట్ట తాత చెరువు.. ఇప్పుడు రాఘవమ్మచెరువు
- వాటాలు ఇవ్వడం లేదని జనసైనికుల మండిపాటు
- మెట్ట, చెరువుల్లో యథేచ్ఛగా కొనసాగుతున్న దందా



పొక్లెయిన్‌తో అక్రమ మట్టి తవ్వకాలు



మట్టి తవ్వకాలతో ఉనికి కోల్పోతున్న రాఘవమ్మ చెరువు

పెద్దాపురం: మట్టి మాఫియా పేట్రేగిపోతోంది. ఎక్కడ పచ్చని పంటపొలం, మెట్ట కనబడితే చాలు దానిని తవ్వి లక్షల్లో సంపాదనే ధ్యేయంగా ప్రస్తుత కూటమి నేతల దందా 'ముడు పువ్వులు ఆరు కాయలు' అన్న చందంగా సాగిపోతోంది. కోట్ల రూపాయలు విలువ చేసే రామేశంమెట్టపై ఇప్పటికీ రాత్రనక, పగలనగ నిత్యం గ్రావెల్ దందా కొనసాగిస్తూనే ఉన్నారు. ఇదిలా ఉండగానే కట్టమూరు రహదారిలోని పెద్దాపురం పట్టణ పరిధిలో తాత చెరువుపై కూటమి నేతలు కన్నేశారు. సర్వే నెంబర్ 62/19 లో సుమారు 6.51 ఎకరాల తాత చెరువులో మట్టి అక్రమ తవ్వకాలకు పాల్పడుతూనే మండలంలోనే అతి పెద్ద చెరువు రాయభూపాలపట్నం రాఘవమ్మ చెరువు. ఇక ఆ ప్రాంత నలుగురు భకాసుర నాయకులు నిత్యం రాత్రనక, పగలనక మట్టి తవ్వకాలను జోరుగా సాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం అటువైపు కన్నెత్తి కూడ చూడని పరిస్థితి నెలకొంది. కూటమి నేతల కనుసైగతో గ్రావెల్, మట్టి వ్యాపారం లక్షల్లో జరుగుతోంది. దీనిపై ప్రభుత్వ మెట్టభూములను హరించడం పాపమని పర్యావరణ ప్రేమికులు ప్రశ్నిస్తే వారికి వార్నింగ్‌లు, అధికారులపై హుంకుం జారీ చెయ్యడంతో ఇక వాళ్ల అక్రమ దందా అడ్డుకట్ట వేసేవారు లేరు.

వాటాల్లో వంతులాట

ఆర్‌బిపట్నం గ్రామంలో జరుగుతున్న అక్రమ మట్టి దందా కూటమి ఐక్యతను చెడగొట్టింది. టీడీపీకి చెందిన మాజీ ఎంపీటీసీ, ఓ యువ నాయకుడు కలిసి టీడీపీ వాళ్లకే వాటాలు ఇవ్వడం జన సైనికులకు రూపాయి ముట్ట చెప్పకపోవంతో ఆ గ్రామంలో జనసైనికులు కూటమి కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. వాటాల్లో బాగాలెటున్నా ఎన్నికల సమయంలో మేము అంతా దగ్గరుండి మెజార్టీ తెప్పిస్తే గ్రామానికి చెందిన నలుగురు టీడీపీ కార్యకర్తలు తామందరినీ పక్కన పెట్టి దండేస్తున్నారంటూ బహిరంగంగా చెప్పుకొస్తున్నారు ఆ గ్రామ జన సైనికులు.

ట్రాక్టర్ మట్టి ధర రూ.2,500

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇళ్ల స్థలాలాకు, రైతు పొలాలకు ఉచితంగా మట్టి తోలుకునేందుకు అనుమతిలిస్తే ప్రస్తుత కూటమిలో ఈ మట్టి బకాసురులు మాత్రం ప్రభుత్వానికి వేలల్లో చలానా చెల్లించినట్లు చెప్పుకుంటూ లక్షల్లో ఆదాయం కూడగట్టుకుంటున్నారు. అదికూడా గ్రామానికి చెందిన వేరేకరితో అనుమతి ఉందంటూ ఈ దందాకు పాల్పడుతున్నారు. గతంలో తక్కువ ధరకే మిషన్ తవ్వకానికి, లారీ ఆయిల్ నిమిత్తం రైతులకు, ఇళ్లకు లారీ ఒక ట్రిప్ లోకల్‌కి రూ.900 రూపాయలు తీసుకుని ఉచితంగా మట్టిని సరఫరా చేసేవారు. ఇప్పుడు ఆ మట్టి బకాసురులు 2,500 రూపాయలు వసూళ్లు చేస్తున్నారు. రాత్రనక, పగలనగ లోకల్ కాకుండా పెద్దాపురం, కాకినాడ ప్రాంతాలకు యధచ్ఛేగా మట్టి రవాణా కొనసాగిస్తున్నారు.

రెవెన్యూ, మైనింగ్ అధికారుల చోద్యం

అక్రమ మట్టి, గ్రావెల్ తవ్వకాలు ముమ్మరంగా జరుగుతున్నా అదుపు చేయాల్సిన రెవెన్యూ, మైనింగ్ శాఖాధికారులు చోద్యం చూస్తున్నారు. మామూళ్ల మత్తు, అధికార పార్టీ నేతల ఆదేశాల ముందు తమ విధులు, హక్కులను ప్రదర్శించ లేక మౌననిద్రలో అధికార యంత్రాంగం పని చేస్తోంది. ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఆ ఒక్క రోజూ గ్రావెల్ లారీలు, జేసీబీలను ఆపి మరుసటి రోజున యదాతధంగా తవ్వకాలు జరుపుతున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే అబ్బే అక్కడ ఏ తవ్వకాలు జరుగడం లేదు. ఫిర్యాదు అందితే చర్యలు చేపడతామంటూ విచిత్ర సమాధానం చెబుతూ అధికార యంత్రాంగం కాలం వెల్లదీస్తుంది.

మట్టి అక్రమ తవ్వకాలను ఆపాలి



పెద్దాపురం మండలంలో జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలను ఆపాలి. దీనిపై పలుమార్లు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశా. తాత్కాలిక చర్యలు తప్పా శాశ్వత చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. దీనిపై కోర్టులో ప్రైయివేట్ కేసు వేస్తాం. చక్కటి చెరువులను, కొండలను గుల్ల చేస్తున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు.

– గుణ్ణం లక్ష్మణరావు,ఫర్ ది పీపుల్ ఫౌండేషన్ చైర్మన్, పెద్దాపురం

ఎటువంటి అనుమతులూ లేవు



మట్టి తవ్వకాలకు పెద్దాపురంలో ఎటువంటి అనుమతులు లేవు. మైనింగ్ శాఖ అనుమతులున్నాయో లేదో తెలుసుకుంటాం. మా దృష్టికి వస్తే గతంలో తవ్వకాలు నిలిపివేశాం. ఎక్కడైనా గ్రావెల్, మట్టి అనధికార తవ్వకాలు జరిపితే సంబంధిత వ్యక్తులపై చర్యలు తప్పవు.

– కె.వెంకటలక్ష్మి, తహసీల్దార్, పెద్దాపురం

వైభవంగా కల్యాణ మహోత్సవం



వైభవంగా జరుగుతున్న స్వామిఅమ్మవార్ల కల్యాణం

ఏలేశ్వరం: శ్రీ అనంతలక్ష్మీ సమేత శ్రీ సత్యనారాయణస్వామి వారి పాంచాహ్నిక వార్షిక దివ్యకల్యాణ మహోత్సవంలో భాగంగా శనివారం స్వామిఅమ్మవార్ల వార్షిక కల్యాణం వైభవంగా నిర్వహించారు. అన్నవరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.సుబ్బారావు ఆధ్వర్యంలో స్థానిక ఏలేరు నది ఒడ్డున ఉన్న శ్రీ సత్య నారాయణ స్వామి వారి ఆలయంలో అర్చకుడు పొన్నూరు సత్యనారాయణ చార్యులు నేతృత్వంలో స్వామి అమ్మవార్ల కల్యాణం ఘనంగా జరిపించారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణాన్ని తిలకించేందుకు పట్టణ నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, మున్సిపల్ కౌన్సిలర్ మూది నారాయణస్వామి మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రైలు ఢీకొని ఉద్యోగి మృతి

తుని రూరల్: తుని రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో నర్సీపట్నం–గుళ్లపొడు స్టేషన్ల మధ్య రైలు ఢీకొనడంతో హెటిరో కంపెనీలో సేఫ్టీ ఫిట్టర్‌గా పని చేస్తున్న రెడ్డి సాయి మోహన్ (35) మృతి చెందినట్టు హెడ్ కానిస్టేబుల్ జి.మోహన్‌రావు తెలిపారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం న్యాయంపూడి గ్రామానికి చెందిన సాయిమోహన్ శనివారం ఉదయం తన బంధువులు ఇంటికి దగ్గర మార్గం కావడంతో సీతంపాలెం వెళ్లేందుకు రైలు పట్టాలు దాటుతుండగా ఈ ప్రమాదం జరిగిందన్నారు. ఆరు నెలలు కిందట వివాహం కావడం, ఇంతలోనే ప్రమాదానికి గురికావడంతో ఉటుంబంలో విషాదం నెలకొంది.

బాధితులను పరామర్శించిన దవులూరి



మాధవపట్నంలో మేడిశెట్టి వీరభద్రాన్ని కలిసిన దవులూరి దొరబాబు, పార్టీ నాయకులు



మర్లావలో కామన చక్రాన్ని పరామర్శిస్తున్న దొరబాబు

సామర్లకోట: మండల పరిధిలోని ఇటీవల అనారోగ్యానికి గురైన పలువురు పార్టీ నాయకులను, ప్రజలను పెద్దాపురం వైఎస్సార్ సీపీ కో-ఆర్డినేటర్ దవులూరి దొరబాబు శనివారం పరామర్శించారు. ఈ మేరకు ఇటీవల అనారోగ్యానికి గురైన మాజీ ఎంపీపీ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రంను మాధవపట్నంలోని స్వగృహంలో ఆయనను కలిసి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు నిడదవోలు సురేష్ కుమార్ ఇటీవల ప్రమాదానికి గురై కాళ్లకు గాయాలు కావడంతో కాకినాడ ప్రైయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూన్న సురేష్ కుమార్‌ను ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ అయ్యరక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఆవాల లక్ష్మీ నారా యణ, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు ఉబా జాన్‌మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు తలారి దొరబాబు, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మోరంపూడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దొరబాబును కలిసిన పార్టీ నాయకులు

నెల రోజుల పాటు దొరబాబు అమెరికా పర్యటనకు వెళ్లి శుక్రవారం సాయంత్రం స్వగ్రామానికి తిరిగి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను నియోజకవర్గ పరిధిలోని పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు శనివారం ఆయన స్వగృహంలో కలుసుకున్నారు. అనంతరం నియోజకవర్గంలోని పలు ప్రధాన సమ్యలపై నాయకులతో చర్చించారు.

కార్యకర్తకు అండగా వైఎస్సార్ సీపీ

పెద్దాపురం: కార్యకర్తకు ఏ కష్టం వచ్చినా వైఎస్సార్ సీపీ అండగా నిలుస్తుందని ఆ పార్టీ పెద్దాపురం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని మర్లావ, .జె.తిమ్మాపురం, ఉలిమేశ్వరం గ్రామాల్లో ఇటీవల గాయాలపాలైన వైఎస్సార్ సీపీ కార్యకర్తను శనివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ పార్టీని నమ్ముకున్న కార్యకర్తకు వైఎస్సార్ సీపీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. అనారోగ్యం, గాయాలపాలైన కార్యకర్తలు త్వరలో కోలుకుని పార్టీలో చురుకుగా వ్యవహరించాలని భగవంతుడిని కోరుతున్నానన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరాల కరపత్రాలను ఆవిష్కరించిన సీఐలు, ట్రాఫిక్ ఎస్సై



ఆటో డ్రైవర్లకు కాకి యూనిఫారం అందజేస్తున్న డీఎస్పీ, సీఐలు

సామర్లకోట: దేశ వ్యాప్తంగా జరుగుతున్న సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఐలు ఎ.కృష్ణభగవాన్, అంకబాబులు పిలుపునిచ్చారు. స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో శనివారం సైబర్ నేరాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. పార్టుటైమ్ జాబ్ ఆఫర్, లోన్సు, షేర్స్ పేరుతో మోసాలు జరుగుతున్నాయని ప్రతీ ఒక్కరూ నిత్యం అప్రమతంగా ఉండవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయని హెచ్చరించారు. ఎంతో మేధావులు కూడా సైబర్ నేరాలలో చిక్కుకొని కోటి రూపాయాలు నష్ట పొయిన సంఘటనలు ఉన్నాయని క్రైమ్ సీఐ అంకబాబు వివరించారు. రైల్వే స్టేషన్, బస్సు కాంప్లెక్స్‌లలో అనుమానస్పదంగా తిరుగుతున్న వారిపై నిఘా వేయాలన్నారు. అటువంటి వారిపై పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

యూనిఫామ్ విధిగా ధరించాలి

ఆటో డ్రైవర్లు తప్పని సరిగా యూనిఫారం ధరించాలని పెద్దాపురం డీఎస్పీ డి. శ్రీహరిరాజు అన్నారు. ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు శనివారం ఆటో డ్రైవర్లకు కాకి యూనిఫారం అందజేత కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో పిఠాపురం, పెద్దాపురం, కాకినాడ, వేట్లపాలెం, ఉండూరు ఆటో స్టాండ్‌లలోని డ్రైవర్లకు కాకి యూనిఫారం అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు తప్పని సరిగా కాకి యూనిఫారం ధరించాలన్నారు. యూనిఫారం ఉండటంతో ఆటో డ్రైవర్‌గా గుర్తించడానికి అవకాశం ఉంటుందన్నారు. అనేక మంది టీషర్టు, షాట్‌లను ధరించడం వలన ప్రయాణికులు ఎవరో ఆటో డ్రైవర్లు ఎవరో గుర్తించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. నేరాలు అదుపు చేయడానికి ఆటో డ్రైవర్లు పోలీసులకు సహకరించాలన్నారు. కాకి యూనిఫారం ధరించని వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ కృష్ణభగవాన్, క్రైమ్ సీఐ అంకబాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు..!



పిఠాపురం రోడ్డులో కొత్త వంతెన మధ్యలో ప్రమాదకరంగా ఉన్న ఊసలు

సామర్లకోట: స్థానిక పిఠాపురం రోడ్డులోని ఏలేరు కాలువపై ఉన్న వంతెనపై ఇనుప ఊసలు ప్రమాదకరంగా రోడ్డు మధ్యలో ఉండటంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. పిఠాపురం రోడ్డులో ఏలేరు కాలువపై ఉన్న ఇరుకు వంతెన కూలి పావడంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వంతెన నిర్మాణం చేపట్టారు. ఇనుప ఊసలను రోడ్డు మధ్యలో పైకి లేచి ఉండటంతో వాహన చోదకులు ప్రమాదలకు గురవుతున్నారు. సదరు రోడ్డులో రాత్రిళ్ల వీధిలైట్లు లేక వంతెనపై అంధకారంగా ఉండటం ప్రమాదాలకు ఓ కారణంగా చెప్పుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని వంతెనకు మధ్యలో ప్రమాదభరితంగా ఉన్న ఇనుప ఊసలను తొలగించాలని వాహనచోదకులు కోరుతున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ ఎఈ ఫణిని వారం రోజుల క్రితం వివరణ కొరగా ఊసలు తొలగిస్తామని చెప్పినా ఇప్పటికి అదే పరిస్థితి నెలకొని ఉంది.

లయన్స్ క్లబ్ వ్యవస్థాపక దినోత్సవం



లైన్స్ క్లబ్ వ్యవస్థాపకులు మేల్విన్ జోన్స్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పిస్తున్న దృశ్యం

గండేపల్లి: మండలంలోని నీలాద్రిరావుపేట పరిధి గోకవరం రోడ్డులో గల కోడూరి రంగారావు లైన్స్ జిల్లా కంటి హాస్పటల్ నందు శనివారం లయన్స్ క్లబ్ 108వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. లైన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ లయన్ కొత్త కొండబాబు, తదితరులు పాల్గొని లైన్స్ క్లబ్ వ్యవస్థాపకులు మేల్విన్ జోన్స్ విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానికులకు స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్యులు వి.డయానా, ఇన్‌చార్జ్ గంగరాజు, సురేష్, హాస్పటల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నాగులాపల్లి అంటే నిర్లక్ష్యమా..!



నాగులపల్లి ప్రధాన రోడ్డులో పారుతున్న మురుగునీరు

- నాగులాపల్లిలో అధ్వనంగా పారిశుధ్యం
- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- పంచాయతీలో పారిశుధ్య కార్మికులలేమి
- మూలన పడ్డ వాహనాలు



పంచాయతీ కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్న వాహనాలు

కొత్తపల్లి: మండలంలోని నాగులాపల్లి గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని ప్రజలు మొత్తుకుంటున్నా అధికారుల మాటలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. గ్రామంలో ఎక్కడ చూసిన పారిశుధ్యం అధ్వానంగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారులు, ఆలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద, డ్రైన్‌లు పూడికతో పూడుకుపోయాయి. మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుంది. దుర్వాసన వెదజల్లడంతో స్థానికులు, ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పారిశుధ్యమంటే ఇంత నిర్లక్ష్యమా అంటూ ప్రజలు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. బయటకు రావాలంటే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దోమలతో ఇబ్బందులు పడుతున్నామని ఏనాడు కూడా గ్రామంలో దోమల నియంత్రణ మందు పిచికారీ చేసిన పాపాన పోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పారిశుధ్య నిర్లక్ష్యంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి పారిశుధ్యంపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పంచాయతీలో కార్మికులలేమి

నాగులాపల్లి పంచాయితీ పరిధిలో ఒక పారిశుధ్య కార్మికుడు కూడా లేనిపరిస్థితి ఏర్పడింది. ప్రత్యేక డ్రైవ్ పెట్టి అధికారులకు నచ్చినపుడు తూతూమంత్రంగా గ్రామాల్లో పారిశుధ్య పనులు చేస్తున్నారు. కార్మికులు లేకపోవడంతో సమస్యలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

తుప్పుపడుతున్న వాహనాలు

గ్రామంలో పారిశుధ్య కార్మికులు లేకపోవడంతో సంబంధిత వాహనాలకు పనిలేక నిరుపయోగంగా పడిఉన్నాయి. దీంతో విలువైన వాహనాలు తుప్పుపట్టి పోతున్నాయి. లక్షలు విలువ చేసే ట్రాక్టర్, వ్యాన్, 6 రిక్షాలు నిరుపయోగంగా పడి తుప్పుపడుతున్నాయి. దీనిపై మండల విస్తరణాధికారి సత్యహరికృష్ణారెడ్డిని వివరణ కోరగా నాగులాపల్లి పంచాయతీకి సంబంధించి పారిశుధ్య కార్మికులు లేరు. దీంతో నిర్వహణలో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కార్మికులకు సంబంధించి వేసిన టెండరు ప్రకటనకు ఎవరూ రావడంలేదు. దీంతో ప్రత్యేక డ్రైవ్ పేరుతో మిగిలిన గ్రామాల్లోని పారిశుధ్య కార్మికులతో పనులు చేయవలసి వస్తుంది.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు



సామర్లకోటలో బక్రీద్ శాంతియుత ప్రార్థనలు చేస్తున్న ముస్లీం సోదరులు



పెద్దాపురంలో బక్రీద్ ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లీం సోదరులు

సామర్లకోట: ముస్లింలు సామర్లకోట పట్టణ వ్యాప్తంగా శనివారం భక్తి శ్రద్ధలతో బక్రీద్ వేడుకలను జరుపుకున్నారు. పట్టణ పరిధిలోని మసీదుల్లో తెల్లవారు జాము నుంచే ప్రార్థనలు నిర్వహించారు. చిన్నారులు, యువత పెద్దలు, మహిళలు కొత్త బట్టలు ధరించి మసీదులకు తరలి వచ్చారు. మత గురువులు ఆయా మసీదుల్లో బక్రీద్ ప్రార్థనలు చేపట్టారు. అనేక మంది ముస్లీంలు మేక మాంసంతో తయారు చేసిన ఆహార పదార్థాలను పేదలకు పంచారు. ఆకలితో ఉన్న వారి ఆకలి తీర్చడమే బక్రీద్ పండుగకు ప్రతీకని ముస్లిం నాయకులు తెలిపారు. చనిపోయిన వారి సమాధుల వద్ద పిండి వంటలు, వారికి ఇష్టమైన దుస్తులను ఉంచి ప్రార్థనలు చేశారు. త్యాగానికి గుర్తుగా నిర్వహించే బక్రీద్ సందర్భంగా హిందూ, క్రిస్టియన్‌లకు ఈద్ అల్ ఫితార్ అంటూ శుభాకాంక్షలు తెలిపారు. పిఠాపురం రోడ్డులో ఉన్న మసీదులు, పెన్షన్‌లైన్‌లో ఉన్న మసీదులలోనూ, పోలీసు స్టేషన్ ఎదురుగా కోటమ్మ చెరువు వద్ద ఉన్న దర్గాలోను ప్రార్థనలు చేశారు.

శాంతియుతంగా బక్రీద్ వేడుకలు

పెద్దాపురం: పవిత్ర ఈదుల్ జహా (బక్రీద్) పర్వదిన వేడుకలు పెద్దాపురం పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కబడ్డీ వీధి, దర్గాపేట, ఆసుపత్రి రోడ్డు మసీదుల్లో ఈద్ సమాజ్ ఆచరించారు. ముస్లిం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మత బోధను బోధించారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు మాట్లాడుతూ సృష్టికర్త ఆదేశానుసారం తన త్యాగనిరతిని నిరూపించుకున్న ప్రవక్త ఇబ్రహీం మార్గాన్ని ప్రతీ ముస్లిం మతస్థుడు ఆచరించాలన్నారు. నమాజ్ అనంతరం ఒకరిని ఒకరు అలింగనం చేసుకుని ఈద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ కరీమ్ జానీ, సయ్యద్ ఖాదర్, ఆషిక్ ఆలీ, ఆయా మసీద్‌ల పరిధిలోని తదితరులు పాల్గొన్నారు.